ప్రజాశక్తి
గురువారం 14 సెప్టెంబరు 2023
5
శ్రీకాకుళం

టెక్కలి సబ్ కలెక్టర్‌గా నూరల్‌కుమార్

ప్రజాశక్తి - టెక్కలి

టెక్కలి సబ్ కలెక్టర్‌గా నూరల్ కుమార్ నియమితులయ్యారు. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్ జవహర్ రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పాలకొండ సబ్ కలెక్టర్‌గా పనిచేస్తున్న నూరల్ కుమార్ బదిలీపై ఇక్కడికి రానున్నారు. టెక్కలి సబ్ కలెక్టర్‌గా పనిచేసిన రాహుల్ కుమార్ రెడ్డి జాయింట్ కలెక్టర్‌గా నంద్యాల జిల్లాకు బదిలీ అయిన విషయం విదితమే. ఆయన స్థానంలో ఇప్పటివరకు ఇన్‌ఛార్జిగా పలాస ఆర్‌డిఒ సీతారామయ్య బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

మందకొడిగా ఈ-క్రాప్

- ఈనెల 15 తుది గడువు
- ఇప్పటివరకు 72 శాతమే పూర్తి
- సాంకేతిక సమస్యలతో జాప్యం
- నమోదు ఆలస్యం కావడంతో నెలాఖరుకు గడువు పెంపు

జిల్లాలో ఈ-క్రాప్ నమోదు మందకొడిగా సాగుతోంది. పంటల కొనుగోలు, వరదలు, తుపాన్ల సమయంలో ఇన్సూరెన్స్ తదితర సౌకర్యాల వర్తింపునకు మూడేళ్లుగా ఈ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ ఏడాది ఈ-క్రాప్ బుకింగ్‌లో ప్రభుత్వం కొత్త మార్పు తీసుకొచ్చింది. గతంలో రైతు సాగు చేసిన పంటకు మాత్రమే ఫొటో అప్‌లోడ్ చేయగా, కొత్త విధానంలో పాలంలో రైతు ఉంటుండగా ఫొటో తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. పంటల బుకింగ్ ప్రక్రియలో పలు అంశాలు నమోదు చేయాల్సి రావడం, వాటికితోడు సాంకేతిక సమస్యలు జత కావడంతో ఈ-క్రాప్ నెమ్మదిగా సాగుతోంది. పంటల బుకింగ్‌కు ప్రభుత్వం ఈనెల 15వ తేదీని గడువుగా నిర్ణయించింది. ఇప్పటివరకు 70 శాతం వరకే జరగడంతో నెలాఖరు వరకు పొడిగించింది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

కవిటి : ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ సహాయకుడు కళ్యాణ్

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ, ఉద్యాన పంటలు కలిసి ఐదు లక్షల ఎకరాలు సాధారణ సాగుగా ఉంది. ప్రస్తుతం 4,42,775 ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. ఇప్పటివరకు 3,17,167 ఎకరాలను (72 శాతం) నమోదు చేశారు. గత నెల మొదటి వారంలో ఈ ప్రక్రియను ప్రారంభించారు. మూడేళ్లుగా ఈ-క్రాపింగ్ చేపడుతున్నా, ఈ ఏడాది ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త విధానంతో అటు రైతులు, ఇటు సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. ఆర్‌బికెల్లో పనిచేసే వ్యవసాయశాఖ అసిస్టెంట్లు, వ్యవసాయ అనుబంధ శాఖల సిబ్బంది పొలం వద్దకు వెళ్లి భూమి సబ్ డివిజన్ సర్వే నంబర్ల ఆధారంగా పంట వివరాలను నమోదు చేస్తున్నారు. రైతుల ఫొటోలను అప్‌లోడ్ చేస్తున్నారు. భూమి సర్వే నంబర్లు, పాస్ పుస్తకాల ఖాతాల నంబర్లు, ఏ పంట వేశారో నమోదు చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఫార్మాట్‌లో తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాల్సి ఉండడంతో ఎక్కువ సమయం పడుతోంది.

పంటల నమోదు పరిస్థితి ఇలా...

వ్యవసాయ శాఖకు జిల్లాలో ఏడు సబ్ డివిజన్లు ఉన్నాయి. అందులో నరసన్నపేట సబ్ డివిజన్‌లో 39,450 ఎకరాల్లో పంటల బుకింగ్ జరిగింది. రణస్థలం డివిజన్‌లో 28,778 ఎకరాల మేర వివరాలు నమోదయ్యాయి. పలాసలో 38,287 ఎకరాలకు సంబంధించిన వివరాలను సేకరించారు. శ్రీకాకుళం డివిజన్‌లో 27,960 ఎకరాల వరకు నమోదయ్యాయి. సోంపేటలో 20,853 ఎకరాలను నమోదు చేశారు. టెక్కలిలో 42,747 ఎకరాలు, కొత్తూరు డివిజన్‌లో 31,433 ఎకరాలు ఈ-క్రాప్‌లో నమోదయ్యాయి.

వివరాల నమోదుకు సర్వర్ సమస్యలు

పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో సాంకేతిక సమస్యలు తీవ్రంగా ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా అంతా ఒకేసారి ప్రయత్నిస్తుండడంతో సర్వర్ సమస్యలు తలెత్తుతున్నట్లు సిబ్బంది చెప్తున్నారు. పైగా కొన్నిచోట్ల సిగ్నల్స్ లేకపోవడంతో అప్‌లోడ్‌కు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. యాప్‌లో లోపాలతో జియోట్యాగింగ్ సరిగా జరగడం లేదంటూ ఆందోళన చెందుతున్నారు. ఫలితంగా పంటల నమోదు ప్రక్రియ చాలా మందకొడిగా సాగుతోంది. రైతుభరోసా కేంద్రాల్లో సిబ్బంది కొరత ఉండడంతో పంటల సాగు ముందుకు సాగడం లేదు.

పనిఒత్తిడితో సిబ్బంది సతమతం

ఒక విఎఎ రోజుకు ఆరు ఎకరాల వరకు జియోట్యాగింగ్ చేయాలని స్పష్టం చేసింది. ప్రతి సర్వే నంబరుకు, అదేవిధంగా ఆయా సర్వే నంబర్లలోని సబ్ డివిజన్లకు వెళ్లి జియోట్యాగింగ్ ద్వారా ఈ-క్రాప్ నమోదు చేస్తున్నారు. గతంలో కార్యాలయాల్లో కూర్చొని రైతులు తీసుకొచ్చిన పట్టాదారు పాసు పుస్తకాలు, ఒన్ బి ద్వారా పంట నమోదు చేసే పరిస్థితి ఉండేది. సిగ్నల్ లేని చోట, కొండల పైకి వెళ్లలేని సందర్భంలో రైతులు అందించే వివరాలతో ఈ-క్రాప్ చేసే వెసులుబాటు ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. క్షేత్రస్థాయికి వెళ్తే గానీ పని జరిగే అవకాశం లేదు. పొలాలకు వెళ్లి పంట వివరాలు, రైతు ఫొటోలను తీసి అప్‌లోడ్ చేస్తే గానీ జియోట్యాగింగ్ పూర్తయ్యే పరిస్థితి లేదు. దీంతో విఎఎలు, విహెచ్ఎలు కొంత పనిఒత్తిడికి లోనవుతున్నారు.

రైతులకు తప్పని అవస్థలు

ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త విధానంతో అటు రైతులకూ ఇబ్బందులు తప్పడం లేదు. భూములను కౌలుకు ఇచ్చి వలస వెళ్లిన వారికి ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో వారు రాకుండానే పంట ఈ-క్రాప్‌లో నమోదయ్యే పరిస్థితి ఉండేది. జియోట్యాగింగ్ పద్ధతిలో వారు తప్పనిసరిగా రావాల్సి వస్తోంది. పంటను ఏదో విధంగా అమ్ముకుందామనుకున్నా ఈ-క్రాప్ చేయించకపోతే ఇన్సూరెన్స్ వచ్చే పరిస్థితి లేకపోవడంతో, కొందరు సొంత గ్రామాలకు వస్తున్నారు. భూమిని కౌలుకు ఇచ్చిన వారు మాత్రం రావడానికి ఇష్టపడడం లేదు.

ఈ-క్రాప్ వేగవంతానికి చర్యలు

ఈ-క్రాప్‌ను వేగవంతం చేసేలా చర్యలు చేపడుతున్నాం. పంటలు సాగు చేస్తున్న రైతుల వివరాలను నమోదు చేస్తాం. సర్వర్ సమస్యలు వల్ల పంటల సాగు ముందుకు సాగడం లేదు. పంటల నమోదుకు ప్రభుత్వం నెలాఖరు వరకు గడువు పెంచింది. రైతులంతా తమ వివరాలను నమోదు చేసుకోవాలి.

- కె.శ్రీధర్,
వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు

వడ్డీ పేరుతో మళ్లీ విద్యుత్ భారాలు

- రూ.1500 కోట్లకు విద్యుత్‌శాఖ ప్రతిపాదన
- ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తులసీదాస్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తులసీదాస్

వడ్డీ పేరుతో మరో రూ.1500 కోట్లు రాష్ట్ర ప్రజలపై విద్యుత్ భారాలు మోపేందుకు విద్యుత్‌శాఖ చేసిన ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ డిమాండ్ చేశారు. నగరంలోని సుందరయ్య భవన్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి అధ్యక్షతన ఆ పార్టీ జిల్లా విస్తృత సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే అధిక ధరలు, అదనపు భారాలతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే వడ్డీ పేరుతో మళ్లీ విద్యుత్ భారాలు వేయడం తగదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్ల నుంచి విద్యుత్ ఛార్జీల పెంపు, శ్లాబులు మార్చి భారాలు మోపడం, ట్రూ అప్ ఛార్జీలు, సర్‌ఛార్జీలు, కస్టమర్ ఛార్జీలు, ఫిక్స్‌డ్ ఛార్జీలు, విద్యుత్ సుంకం పెంచడం, సర్దుబాటు ఛార్జీల పేర్లతో రెట్టింపు భారాన్ని ప్రజలపై వేశారని వివరించారు.

బిల్లులు చెల్లించలేక ప్రజలు గగ్గోలు పెడుతున్నారని, వ్యాపారాలు దెబ్బతింటున్నాయని, పరిశ్రమలు మూతపడుతున్నాయని, ఉపాధి దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతినెలా జమా ఖర్చులపై విచారణ లేకుండానే యూనిట్‌కు అదనంగా 40 పైసలు చొప్పున సర్దుబాటు ఛార్జీలు వసూలు చేయడం దారుణమన్నారు. విద్యుత్ నియంత్రణ మండలి ప్రభుత్వం నుంచి బకాయిలు వసూలు చేయడానికి ఆదేశాలు ఇవ్వాలని, ఆలస్యమైతే వడ్డీ కూడా ప్రభుత్వం నుంచి వసూలు చేయాలని తెలిపారు. వినియోగదారులపై వడ్డీ భారం వేసే ప్రతిపాదనలను తిరస్కరించాలన్నారు. ఇప్పటికే విధిస్తున్న సర్దుబాటు ఛార్జీల భారాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీలు, ప్రజాసంఘాలు, ప్రజల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. బహిరంగ విచారణ హైదరాబాద్‌లో కాకుండా అమరావతిలో చేయాలన్నారు. అన్ని ప్రాంతాల వారు పాల్గొనేందుకు వీలుగా ఆన్‌లైన్‌లో నిర్వహించాలని తెలిపారు. విద్యుత్ శాఖ భారాల ప్రతిపాదనలకు వ్యతిరేకంగా సిపిఎం ప్రజలను చైతన్యపరుస్తుందని, ఉద్యమాలు చేపడుతుందని చెప్పారు.

ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు పంటలు వేయడానికి ప్రభుత్వం సహాయం చేయాలని, బ్యాంకులు రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలు పతనమవుతున్నాయని, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు ప్రజా ఉద్యమం రావాలన్నారు. రాజ్యాంగ పరిరక్షణ ద్వారానే సామాన్యుడికి రక్షణ లభిస్తుందన్నారు. మణిపూర్ హింసకు ప్రధాని మోడీ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వానికి అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ల ప్రయోజనాలు తప్ప ప్రజలు ప్రయోజనాలు పట్టడం లేదని విమర్శించారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు మాట్లాడుతూ 80 కేజీల జీడి పిక్కల బస్తాకు రూ.16 వేల గిట్టుబాటు ధర కల్పించాలని, ప్రభుత్వమే రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఐటిడిఎను ఏర్పాటు చేయాలని, గిరిజన భూములకు రక్షణ కల్పించాలన్నారు. జిల్లాలో వంద పడక ఇఎస్ఐ ఆస్పత్రి నిర్మించాలని, రిమ్స్‌ని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా మార్చాలని కోరారు. కోడి రామ్మూర్తి స్టేడియం నిర్మాణానికి ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సమర్ధవంతంగా ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆదేశించారు. ఉద్దానం కిడ్నీ రీసెర్చ్ కేంద్రంలో వైద్యుల నియామకం తదితర పనులు వేగవంతం చేయాలన్నారు. కలెక్టర్, ఉన్నతాధికారులతో సిఎం బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ గ్రామ, పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్య శిబిరాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్య సమస్యలకు సంబంధించి ప్రతి ఇంటినీ సందర్శించి, ప్రతి వ్యక్తి ఆరోగ్య వివరాలను తెలుసుకునేందుకు వాలంటీర్లు, వైద్య సిబ్బంది ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. ఈనెల 30 నుంచి వైద్య శిబిరాలు నిర్వహించేందుకు షెడ్యూల్‌ను ఖరారు చేశామన్నారు. జిల్లాలోని 594 సచివాలయాలతో పాటు 13 పట్టణ ఆరోగ్య కేంద్రాలకు మ్యాపింగ్ చేయనున్నట్లు చెప్పారు. ఈ పథకం కింద ఇంటింటికీ వాలంటీరు వెళ్లి ఆ కుటుంబంలోని ఆరోగ్య సమస్యలపై వివరాలు సేకరించి టోకెన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. గ్రామంలో నిర్వహించే వైద్య శిబిరం తేదీపై ముందుగా అందరికీ తెలిసేలా ప్రచారం చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి శిబిరంలో ఇద్దరు వైద్యులు, స్పెషలిస్టు ఉండేలా చర్యలు చేపట్టామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ ప్రకాశరావు, జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి కె.వెంకటేశ్వరరావు, ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

పింఛన్లను పంపిణీ చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆర్థిక నేరం చేస్తే శిక్ష తప్పదు

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - పొందూరు

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆర్థిక నేరానికి పాల్పడ్డారని, ఆర్థిక నేరం చేస్తే ఎవరికైనా శిక్ష తప్పదని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో రెండో విడతలో నూతనంగా మంజూరైన పింఛన్లను స్థానిక మహారాజా మార్కెట్ ఆవరణలో బుధవారం పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ స్కిల్ స్కాంలో ప్రధాన నిందితుడు చంద్రబాబునాయుడే అని అన్నారు. షెల్ కంపెనీల పేరుతో నేరానికి పాల్పడడంతో అరెస్టు చేస్తే టిడిపి గగ్గోలు పెడుతోందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు ఎన్నో మోసాలు చేసినా తప్పించుకున్నారని, ఇన్నాళ్లకు దొరికిపోయారని చెప్పారు. గతంలో నేరాలకు పాల్పడిన లాలూప్రసాద్ యాదవ్, జయలలిత, శిబూసోరెన్ వంటి వారు జైలుకు వెళ్లారని, వాళ్ల కంటే చంద్రబాబు గొప్పవారా అని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తోందన్నారు. ప్రతి ఇంటిలోనూ సంక్షేమ పథకాల లబ్ధిదారులు ఉన్నారని చెప్పారు. కుల, మత, ప్రాంత, పార్టీలకతీతంగా రాష్ట్ర ప్రభుత్వం అర్హతే ప్రాతిపదికగా పథకాలను అందిస్తోందన్నారు. అనంతరం వైసిపి రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ సమక్షంలో పలువురు వైసిపిలో చేరారు. కార్యక్రమంలో ఎంపిపి కిల్లి ఉషారాణి, పిఎసిఎస్ అధ్యక్షులు కె.రమణమూర్తి, వైసిపి మండల అధ్యక్షులు పప్పల రమేష్‌కుమార్, బండారు జైప్రతాప్‌కుమార్, గాడు నాగరాజు, చింతాడ సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రూ.2,300 కోట్ల టర్నోవర్

డిసిసిబి సిఇఒ వరప్రసాద్

ప్రజాశక్తి - సోంపేట

డిసిసిబి రూ.2,300 కోట్ల టర్నోవర్ చేస్తోందని ఆ బ్యాంకు సిఇఒ డి.వరప్రసాద్ తెలిపారు. స్థానిక డిసిసిబి బ్రాంచ్ వద్ద డిపాజిట్ల సేకరణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోంపేట బ్రాంచ్ రూ.వంద కోట్ల టర్నోవర్ లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందులో భాగంగా ఒక్కరోజు రూ.1.12 కోట్ల డిపాజిట్లు సేకరించినట్లు తెలిపారు. పలు రైతుసంఘాలకు, రైతులకు నిబంధనల మేరకు రూ.కోటి వరకు రుణాలు సైతం మంజూరు చేశామన్నారు. డిసిసిబి ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నోడల్ అధికారి జి.మురళీధర్, బ్రాంచ్ మేనేజర్లు చంద్రశేఖరం, హేమసుందర్, తులసీబాయి, బి.రామారావు, ఎస్.నారాయణరావు, పిఎసిఎస్ అధ్యక్షుడు రౌతు విశ్వనాథం, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిసిసిబి సిఇఒ వరప్రసాద్

రిమ్స్‌లో అందుబాటులోకి కార్మ్ యంత్రం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రిమ్స్ ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో కంప్యూటర్ అసిస్టెడ్ రేడియో మోనిటరింగ్ యంత్రం (కార్మ్) అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ యంత్రాన్ని ఆర్థోపెడిక్ విభాగం హెచ్ఒడి డాక్టర్ టి.శ్రీనివాసరావు బుధవారం ప్రారంభించారు. ఎముకలు విరిగిన ప్రదేశంలో సూక్ష్మమైన శస్త్రచికిత్సల అవసరాన్ని గుర్తించేందుకు ఈ యంత్రాన్ని వినియోగించనున్నట్లు తెలిపారు. రోగులు ఇకపై ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఆర్ఎంఒ డాక్టర్ ఎల్.ప్రసన్న కుమార్, కె.శ్రీనివాసరావు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పరికరాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు

ఉత్తమ ఫలితాలు సాధించాలి

రీజనల్ జాయింట్ డైరెక్టర్ శోభారాణి

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

ఆర్‌జెడికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రిన్సిపాల్

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు సమిష్టి కృషి చేయాలని రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఎస్.శోభారాణి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలో అధ్యాపకులతో సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. సీడాప్ చైర్మన్ శ్యామ్‌ప్రసాద్ రెడ్డి కళాశాలలో నెలకొన్న పలు సమస్యలు ఆర్‌జెడి దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం శ్యామ్‌ప్రసాద్ రెడ్డి విద్యార్థులతో ఇంటరాక్ట్ అయ్యారు. కార్యక్రమంలో కె.అరుణ పద్మ, కో ఆర్డినేటర్ కె.సుధ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రోబిన్ కుమార పాడి, బారువ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇపిడిసిఎల్ సిఎమ్‌డి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - కవిటి ఎపి

మాట్లాడుతున్న సిఎమ్‌డి పృథ్వితేజ్

ఇపిడిసిఎల్ సిఎమ్‌డి పృథ్వితేజ్ మండలంలోని బొరివంక సబ్ స్టేషన్‌ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలోని పరిస్థితులు, నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ఉన్న అవరోధాలు ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం సబ్ స్టేషన్ పరిధిలో మొక్కలు నాటారు. సర్పంచ్ బెందాళం శ్రీరాం ప్రసాద్, ఎంపిటిసి డి.సతీష్, కవిటి ఎఇ నేతాజీ మండలంలో విద్యుత్ సరఫరాలో ఉన్న పలు సమస్యలను సిఎమ్‌డి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఇపిడిసిఎల్ ఎస్ఇ దైవప్రసాద్, పలాస డిఇజి ప్రసాదరావు, ఎడి డి.శ్రీనివాస్, సోంపేట, కంచిలి ఎఇలు జి.రామారావు, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

- టిడిపి రిలే నిరాహార దీక్షలు ప్రారంభం
- పొందూరులో అడ్డుకున్న పోలీసులు
- టిడిపి జిల్లా అధ్యక్షుడు రవికుమార్ అరెస్ట్

కొనసాగుతున్న నిరసనల పరంపర

ప్రజాశక్తి - విలేకరుల యంత్రాంగం

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ ఆ పార్టీ నిరసనల పరంపర కొనసాగిస్తోంది. అందులో భాగంగా జిల్లాలో పలు నియోజకవర్గ కేంద్రాల్లో 'బాబుకు తోడుగా.. నియంతపై పోరాటానికి మేము సైతం' పేరిట నిరాహార దీక్షలను బుధవారం చేపట్టారు. దీక్షల సందర్భంగా పొందూరులో కొంత ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీక్షలకు సిద్ధమైన ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్‌తో పాటు పలువురు నాయకులను అరెస్టు చేశారు.

పొందూరు మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్, రిలే నిరాహార దీక్ష ఆందోళనకు దారితీసింది. దీక్షకు పలు గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు చేరుకున్నారు. నిరాహార దీక్షకు అనుమతి లేదంటూ పెద్దఎత్తున పోలీసులను మోహరించారు. రవికుమార్ దీక్షా స్థలికి చేరుకోకుండా ముందుస్తుగా ఆయన్ను అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు ప్రయత్నించారు. రాపాక కూడలిలో రవికుమార్ కోసం వాహనాలను తనిఖీ చేశారు. సుమారు 11 గంటల సమయంలో పోలీసుల కళ్లుగప్పి రవికుమార్ జీపులో అంబేద్కర్ కూడలికి చేరుకోవడంతో అప్పటివరకు సమీపంలో ఉన్న నాయకులు, కార్యకర్తలు ఒక్కసారిగా నినాదాలు చేస్తూ అక్కడికి చేరుకున్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించి దీక్ష ప్రారంభించారు. చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టులను నిరసిస్తూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆమదాలవలస సిఐ పైడయ్య, ఎస్ఐ లక్ష్మణరావు దీక్షకు అనుమతి లేదంటూ రవికుమార్‌తో పాటు టిడిపి నాయకులను బలవంతంగా పోలీస్ జీపులోకి ఎక్కించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్, టిడిపి నాయకులు కూన వెంకటసత్యనారాయణ, సీపాన శ్రీరంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉదయం నుంచి ఉత్కంఠగానే...

పొందూరులో టిడిపి నిరాహార దీక్షలకు పిలుపునివ్వగా, వైసిపి కొత్త ఫించన్ల పంపిణీ, వైసిపిలోకి చేరికల కార్యక్రమాన్ని నిర్వహించడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పెద్దఎత్తున పోలీస్ బలగాలను మోహరించారు. దీంతో అంబేద్కర్ కూడలిలో ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠ నెలకొంది. అంబేద్కర్ కూడలిలో ఉదయం 9 గంటలకు టిడిపి కార్యక్రమానికి పిలుపునివ్వగా, 10 గంటలకు అదే కూడలిలో అంబేద్కర్, వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు స్పీకర్ తమ్మినేని సీతారాం నివాళి అర్పించేందుకు నిర్ణయించారు. దీంతో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. స్పీకర్ సీతారాం 10 గంటలకు అక్కడికి చేరుకుని నివాళి అర్పించి వెళ్లిపోయిన అనంతరం టిడిపి శ్రేణులు దీక్ష చేపట్టేందుకు చేరుకున్నాయి.

పొందూరు : టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

ఇచ్ఛాపురంలో ఎమ్మెల్యే బెందాళం అశోక్ నిరసన దీక్ష చేపట్టారు. రాష్ట్రంలో జరుగుతున్న హైడ్రామా కక్షసాధింపు ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. తండ్రి శవం పక్కన పెట్టుకొని ముఖ్యమంత్రి పీఠం కోసం సంతకాల సేకరణ చేసిన జగన్ చరిత్ర అందరికీ తెలిసిందేనని విమర్శించారు. చంద్రబాబు బెయిల్‌పై బయటకు వచ్చినంత వరకూ దీక్ష కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టిడిపి నేతలు కాళ్ల ధర్మారావు, సీపాన వెంకటరమణ, నందిగాం కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయ ఆవరణలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి నాయకులతో కలిసి నిరాహార దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు జల్లు రాజీవ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నరసన్నపేటలో నిర్వహించిన దీక్షలో మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పలాస టిడిపి కార్యాలయంలో నిర్వహించిన నిరాహార దీక్షలో ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష, రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు తదితరులు పాల్గొన్నారు. బొడ్డపాలో చింతల పోలమ్మ అమ్మవారి ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో బొడ్డు దుష్యంత్, స్త్రీ విముక్తి మహిళా సంఘం అధ్యక్షులు రాజాం పద్మ, అన్నదాత రైతు సంఘం అధ్యక్షులు రాజాం శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాతపట్నంలో మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ నిరాహార దీక్ష చేపట్టారు. టిడిపి నాయకులు పైల.లచ్చుమయ్య, పి.మోహనరావు, ఎ.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన
మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జివారి (మొబైల్ కోర్టు) శ్రీకాకుళం కోర్టులో
OS No.247/2021

Between:
బొడ్డేపల్లి రాములమ్మ వగైరాలు ....వాదులు
మరియు
బొడ్డేపల్లి లక్ష్మీనారాయణ వగైరాలు....ప్రతివాదులు
To

D3) పేడాడ రాము W/o రమణ, D/o లేటు సూర్యనారాయణ, వయస్సు 42సం।, డోర్‌నెం. 2-68, వాకలవలస గ్రామం, శ్రీకాకుళం మండలం, జిల్లా.

D5) బొడ్డేవలి కిశోర్ S/o లేటు శ్రీనువాసరావు, గ్రాండ్ సన్ ఆఫ్ లేటు కూర్మయ్య, వయస్సు 35 సం।, ఉద్యోగి, డోర్‌నెం. 2-68, వాకలవలస గ్రామం, శ్రీకాకుళం మండలం, జిల్లా.

D6) కూన పద్మ D/o లేటు కూర్మయ్య, డోర్‌నెం. 2-68, వాకలవలస గ్రామం, శ్రీకాకుళం మండలం, జిల్లా.

ఇందు మూలముగా మీకు తెలియజేయునది ఏమనగా పైన తెలిపిన ప్రతివాదులు పై అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రీకాకుళం (మొబైల్) వారి కోర్టులో ఆస్తి పంపకపు కేసు.నెం.O.S. 247/2021 వాది తనకు చట్టబద్ధం రావలసిన వాట నిమిత్తం వేసినది. పెండింగ్‌లో

ప్రజాశక్తి
www.prajasakti.com

చిన్నారికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీనాథరెడ్డి

రిమ్స్‌లో చిన్నారులకు గుండె పరీక్షలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రిమ్స్ ఆస్పత్రిలో చిన్న పిల్లల విభాగంలో చికిత్స పొందుతున్న చిన్నారులను తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీపద్మావతి చిల్డ్రన్ హార్ట్ ఆస్పత్రి కార్డియాలజిస్టు డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. చిన్నారులు గుండెకు సంబంధించిన అన్ని పరీక్షలు నిర్వహించారు. పరీక్షల అనంతరం గుండె సంబంధిత సమస్యలతో బాధపడతున్న చిన్నారులకు మెరుగైన వైద్యం కోసం తిరుమల తిరుపతి దేవస్థానం చిల్డ్రన్ హార్ట్ సెంటర్‌కు తీసుకురావాలని తల్లిదండ్రులకు సూచించారు. నవజాతా శిశువులకు గుండెకు సంబంధించిన పరీక్షలు ప్రతిఆరు నెలలకొకసారి నిర్వహించడం అవసరమని సూచించారు. చిన్నతనంలోనే గుండెలో రంధ్రం ఉంటే వాటిని తొలి దశలోనే చికిత్స ద్వారా నయం చేయవచ్చున్నారు. ఈ శిబిరంలో లయన్స్ అధ్యక్షుడు పొన్నాడ రవికుమార్, మెంటార్ నటుకుల మోహన్, కార్యదర్శి రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఒబిసి సాధనకు కృషి

వినతిపత్రం అందజేస్తున్న విజయ

ఇచ్ఛాపురం: ఆంధ్రాలో వెనుకబడిన జాబితాలో ఉన్న బిసిలను ఓబిసి జాబితాలో చేర్చే అంశం చివరి దశకు చేరుకుంది. ఈ క్రమంలోనే నేషన్ కమిషన్ ఫర్ బ్యాక్ వర్డ్ క్లాసెస్ (ఎన్‌సిబిసి) న్యూఢిల్లీలోని కస్తూరిబా మార్గ్‌లోని న్యూ మహారాష్ట్ర సదన్ సమావేశ మందిరంలో హియరింగ్ తేదీ సమావేశాన్ని ముందుగానే ఎన్‌సిబిసి ప్రకటించింది. దీంతో జిల్లాకు చెందిన కళింగ కోమట్లు, శిష్టకరణాలు సౌండి, అరవల తరగతుల తరుపున జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ ఢిల్లీ వెళ్లారు. ఆయా సామాజిక తరగతుల తరుపున ఆమె ప్రత్యేక చొరవ తీసుకుని ఎన్‌సిబిసి చైర్మన్ హన్స్ రాజ్ గంగారం అహిర్‌ను, సభ్యుడు భువన్ భూషణ్ కమల్‌లను బుధవారం కలుసుకుని వినతిపత్రాన్ని అందజేశారు. సుమారు 2 లక్షల వరకూ ఉన్నారని వారికి వివరించారు.

ప్రశంసా పత్రాలను అందజేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

క్షయ రోగులకు కిట్లు పంపిణీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని క్షయ రోగులకు పౌష్టికాహారాన్ని అందించడమే టిబి ముక్త భారత్ అభియాన్ లక్ష్యమని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో రెడ్‌క్రాస్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సంయుక్తంగా రోగులకు పౌష్టికాహార కిట్లను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిబి కేసులు తగ్గుముఖం పట్టేవిధంగా రెడ్‌క్రాస్ వాలంటీర్లు, క్షయ నివారణ విభాగం ఉద్యోగులు, వైద్య సిబ్బంది కృషి చేయాలన్నారు. జాతీయ స్థాయిలో బంగారు పతకం అందుకునేందుకు గ్రామ పంచాయతీల వారీగా ఈ కార్యక్రమాలను చేపట్టాలన్నారు. అనంతరం పలువురుని అభినందిస్తూ... ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.మీనాక్షి, అదనపు డిఎంహెచ్ఒ డాక్టర్ అనురాధ, రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.మల్లేశ్వరరావు దాతలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ పారదర్శక పాలన

మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పారదర్శక పాలనకు మారుపేరు సిఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి అని మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని మెట్టూరు, ఒంకులూరులో సర్పంచ్ ప్రతినిధి జోగ అప్పారావు అధ్యక్షతన బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్ మాట ఇచ్చారంటే అమలు చేస్తారంతే అని నిరూపించుకున్నారని అన్నారు. మాజీ సిఎం చంద్రబాబు 2014లో అధికారంలోకి రావడానికి హామీలు ఇచ్చి ఒక్కటీ అమలు చేయకుండా అందరినీ మోసం చేశారని పేర్కొన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో రూ.371 కోట్లు అవినీతి చేసి రాజమండ్రి సెంట్రల్ జైలులో ఊచలు లెక్కపెడుతున్నారని అన్నారు. తప్పు చేస్తే ఎవరినైనా అరెస్టు చేస్తారని అన్నారు. ప్రజల ఆర్థిక స్థితిగతులు మెరుగుపర్చడానికి ప్రజాధనం బటన్ నొక్కి నేరుగా వారి ఖాతాలకు డబ్బు జమ చేస్తున్నారని పేర్కొన్నారు. రెండెకరాల ఉన్న చంద్రబాబు ఇప్పుడు రెండు లక్షల కోట్లకు అధిపతి అయ్యారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, పిఎసిఎస్ చైర్మన్ దువ్వాడ మధుకేశవరావు, ఎంపిటిసిలు కొండప్ప సురేఖ, తిరి గుణ, ఆది బలిజ సంఘం అధ్యక్షుడు గుంటు వల్లభరావు, వైసిపి గ్రామ అధ్యక్షుడు లండ శ్రీను, సచివాలయ కన్వీనర్ సండుపల్లి మోహన్, సిహెచ్.ధనుంజయ, ఎంపిటిసి ప్రతినిధి తిరి రాజారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు : ధర్మాన

శ్రీకాకుళం అర్బన్ : సంక్షేమ పథకాల అమలుతో ప్రతి కుటుంబానికీ ప్రయోజనం చేకూరిందని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని చౌదరి సత్యనారాయణ కాలనీలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్ పాదయాత్ర సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారని అన్నారు. రాజకీయ ప్రమేయం, దళారీల జోక్యం లేకుండా నేరుగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. నగరంలోని మార్కెట్ అభివృద్ధి, జిల్లా సర్వజనాసత్రిలో 900 పడకలు అందుబాటులోకి తీసుకొచ్చామని అన్నారు. ఆరు అర్బన్ హెల్త్ సెంటర్ల ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం సంక్షేమ పథకాలను వివరిస్తూ... ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ చల్ల ఓబులేష్, ధర్మాన రామ్ మనోహర్ నాయుడు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మెంటాడ పద్మావతి, సాధు వైకుంఠరావు పాల్గొన్నారు.

కాలనీలో పర్యటిస్తున్న మంత్రి ధర్మాన

ఆరు ఆర్థిక అక్షరాస్యతా కేంద్రాల ఏర్పాటు

ప్రాజెక్టు డైరెక్టర్ ఆంజనేయులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఆంజనేయులు

సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ కర్నూలు అధ్వర్యంలో డిఇఎ ఫండ్ - రిజర్వ్ బ్యాంక్ అఫ్ ఇండియా, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా వారి సౌజన్యంతో జిల్లాలో ఆరు ఆర్థిక అక్షరాస్యతా కేంద్రాలను స్థాపించినట్లు ప్రాజెక్టు డైరెక్టర్ వి. ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆర్థిక అక్షరాస్యతా కేంద్రాల ప్రాజెక్టుకు జిల్లా నోడల్ ఆఫీసర్‌గా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఉంటారని తెలిపారు. ప్రతి ఆర్థిక అక్షరాస్యతా కేంద్రాలలో ఇద్దరు కౌన్సిలర్లుంటారని, వారు వివిధ గ్రామాలలో సామాన్య ప్రజానీకానికి బ్యాంకింగ్ పథకాలపై, సామాజిక భద్రతా పథకాలపై, డిజిటల్ బ్యాంకింగ్‌పై, ప్రైవేటు ఆర్థిక సంస్థల మోసాలపై, ఆన్లైన్ బ్యాంకింగ్ మోసాలపై, రిజర్వ్ బ్యాంక్ అంబుడ్స్మన్ పై అవగాహన కల్పిస్తారని తెలిపారు. అంతే కాకుండా బ్యాంక్ అకౌంట్ ఓపెనింగ్ విషయంలో, అటల్ పెన్షన్ యోజన, సుకన్య సమృద్ధి యోజన, సురక్ష యోజన, జీవన్ జ్యోతి యోజన, ఈ- శ్రమ్ కార్డ్, అభయ కార్డ్ వంటి పథకాలను ప్రజలు పొందడానికి దరఖాస్తు పూర్తి చేయడంలోను బ్యాంక్ దగ్గరకు తీసుకెళ్లడంలోను మా కౌన్సిలర్లు సహాయ, సహకారాలు అందజేస్తారని, ఈ సేవలను ఉచితంగా చేస్తారని తెలిపారు. ఆన్లైన్ బ్యాంకింగ్ మోసాలు జరిగినపుడు ఎలా పరిష్కరించుకోవాలో, ఇన్సూరెన్స్ క్లైమ్ లు ఎలా చేసుకోవాలో తెలియజేసి సహకరిస్తారన్నారు. ఉచితంగా అందించే ఈ సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని, ఆర్థిక మోసాలకు గురి కావొద్దని, ప్రభుత్వ ఆర్థిక పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ వి .ఆంజనేయులు ఆ ప్రకటనలో తెలియజేశారు.

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి- సోంపేట

ప్రభుత్వ పాఠశాలలో చదివి, 540 మార్కులు ఆపైబడి సాధించిన విద్యార్థులకు శ్రీ చైతన్య దీపిక సంస్థ ద్వారా స్కాలర్‌షిప్పులను అందజేస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు మోహనరావు, వీర్రాజు ఓ ప్రకటనలో తెలిపారు. 2022 - 23 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 540 మార్కులు సాధించిన విద్యార్థులు సోంపేటలోని సాగర్ మెడికల్ షాప్ వద్ద తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఇచ్ఛాపురం, కాశీబుగ్గ మున్సిపాలిటీలతోపాటు సోంపేట కంచిలి, కవిటి, పలాస, మందస మండలాలకు చెందిన విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్‌నకు అర్హులని తెలిపారు. విజయదశమి రోజున దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు సంస్థ తరపున అందజేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9493907575, 9440022665, 9985255883 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

స్టేషనరీ కిట్లను అందజేస్తున్న సభ్యులు

స్టేషనరీ కిట్లు పంపిణీ

పొందూరు: మండలంలోని తోలాపి సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యాన తోలాపి ప్రాథమిక, హైస్కూల్, ఖాజీపేట ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న 200 మంది విద్యార్థులకు బుధవారం స్టేషనరీ కిట్లను పంపిణీ చేశారు. పలక, బలపం, ప్లాంక్, నోట్‌బుక్స్, పెన్ను, పెన్సిల్‌తో కూడిన కిట్లను అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి శ్రీకాకుళం జోన్ కన్వీనర్ పప్పల నాగేశ్వరరావు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సత్యసాయి సేవాదల్ కన్వీనర్ పాల్గొన్నారు.

సంఘాలకు బ్యాంకు రుణాల మంజూరు

ప్రజాశక్తి- ఆమదాలవలస

రికార్డులను పరిశీలిస్తున్న ఎపిఎం కూర్మారావు

మండలంలోని పంచ సూత్రాలు పాటిస్తూ ఆరు నెలలు పూర్తి చేసుకున్న అన్ని మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘాలకూ బ్యాంకు రుణాలను మంజూరు చేయిస్తున్నట్లు వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు, మండలంలోని నెల్లిపర్తిలో మహిళా రైతు సంఘాల పుస్తకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు రుణాలను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచడం, పెరటి తోటల పెంపకం, ఆకుకూరలు కాయగూరల పెంపకం చేయాలని సూచించారు. మునగ, బప్పాయి, జామి, కరివేపాకు తదితర మొక్కలను పెంచుతూ కుటుంబ అవసరాలకు ఫోను మిగతా ఉత్పత్తులను మార్కెట్ చేసుకుంటున్న అన్ని సంఘాలకూ ప్రభుత్వం మ్యాపింగ్ గ్రాంట్‌ను మంజూరు చేసే అవకాశం ఉన్నట్లు వివరించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల్లో ఆహార ఉత్పత్తులను తయారు చేసి, మార్కెటింగ్ చేసుకుంటున్న వారికి సబ్సిడీ రుణాలనూ అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సంఘం ప్రతినిధులు క్లస్టర్ కో-ఆర్డినేటర్లు సుభద్ర రామప్ప, విఒఎలు రమా, భారతి పాల్గొన్నారు.

మెమెంటోను అందజేస్తున్న చక్రవర్తి

'కాకినాడ ఆదిత్య'లో ప్రోగ్రామర్స్ డే

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ ప్రోగ్రామర్స్ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ బి.ఎస్.చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్ మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక రంగంలో ప్రోగ్రామర్స్ పాత్ర కీలకమైనదన్నారు. ముఖ్యంగా ఐటి రంగంలో వీరి పాత్ర చాలా ఎక్కువగా ఉందన్నారు. కావున కళాశాలలో అందించే కోడింగ్ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దీనివల్ల కళాశాల వారు అందించే అత్యుత్తమ క్యాంపస్ కొలువులను సాధించవచ్చన్నారు. కళాశాల కంప్యూటర్ విభాగాధిపతి ఎల్.ప్రసాదరరావు మాట్లాడుతూ ప్రోగ్రామర్ అనేది విద్యార్థి తెలివితేటలను బయట పెడుతుందన్నారు. ఇస్రో నిర్వహించిన చంద్రయాన్, ఆదిత్య ఎల్-1, ఇతర అంతరిక్ష రంగంలో ప్రోగ్రామర్స్ కీలకపాత్ర ఉందన్నారు. ప్రోగ్రామర్స్ డే సందర్భంగా కళాశాలలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కంప్యూటర్స్ విభాగ అధ్యాపకులు పాల్గొన్నారు.

విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అశోక్

ప్రకాష్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి- కవిటి

పేదల అభివృద్ధికి, ఉద్దానం ప్రాంతం పురోభివృద్ధికి ఆంధ్రాబ్యాంకు మాజీ డైరెక్టర్ బెందాళం ప్రకాష్ చేసిన సేవలు వెలకట్టలేనివని విశ్రాంత ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పిరియా కృష్ణారావు, పండి బలరామ్మూర్తి అన్నారు. మండలంలోని ప్రగడపుట్టుగలో బెందాళం ప్రకాష్ విగ్రహాన్ని ఎమ్మెల్యే, ఆయన కుమారుడు బెందాళం అశోక్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఉద్దానం ముద్దుబిడ్డగా పేరుగాంచిన ప్రకాష్ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరించేవారని గుర్తుచేసుకున్నారు. నియోజకవర్గంలో టిడిపి తిరుగులేని శక్తిగా ఏర్పడడంలో ప్రకాష్ కృషి అనితర సాధ్యమైదన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు, టిడిపి నాయకులు సీపాన వెంకటరమణ, పొందల కృష్ణారావు, బెందాళం రమేష్, మనిచంద్ర ప్రకాష్, భీమా రెలో, బార్ల చినబాబు, కొర్రాయి వాసు పాల్గొన్నారు.

29న వ్యవసాయ పరపతి సహకార సంఘ సమావేశం

పోలాకి: ఈ నెల 29న పోలాకి వ్యవసాయ పరపతి సహకార సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు సొసైటీ అధ్యక్షులు, డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు తెలిపారు. సొసైటీ కేంద్రంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఉదయం పది గంటలకు సొసైటీ పరిధిలోని రైతులు, పాలకవర్గ సభ్యులు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. అలాగే ఈ నెల ఆఖరిలోగా పిఎసిఎస్ బ్యాంకులో రుణం తీసుకున్న రైతులు తమ ఆధార్ కార్డు, ఒన్ బి, ఎకౌంటు పాస్ బుక్, ప్యాన్ కార్డు, జిరాక్స్ కాఫీలు, ఫొటో, ఫోన్ నంబరు సొసైటీ కార్యాలయానికి అందజే యాలన్నారు. ఈయన వెంట సిఇఒ బి.రాంబాబు, సిబ్బంది ఉన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న రాజు

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ఇచ్ఛాపురం : బెల్లుపడలోని 12,13 వార్డుల్లో నెలకొన్న తాగునీరు, వీధిదీపాల సమస్యలను పరిష్కరించాలని జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు కోరారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయ అధికాధి భాస్కరరావును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కొండవీధి, చిన్నకొండ వీధి, బుడుపు వీధి, రెయ్య వీధి, దల్లి వీధి, నీలపు వీధి, సాషన వీధుల్లో నీటి కోసం జామున 4 గంటలకే కిరాశడ నూతికి వెళ్తున్నారని అన్నారు. దారుపొడుగునా అంధకారం ఉండడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇంతకుముందు ఈ వీధులకు ట్యాంకర్లతో నీరు వచ్చేదని, ఇప్పుడు నిలుపుదల చేశారని వివరించారు. కార్యక్రమంలో నీలాపు సతీష్, హేమంత్, ఆశోక్, వాసు, షణ్ముఖ, కుమార్ పాల్గొన్నారు.

గురువులే మార్గదర్శకులు

కవిటి : సన్మాన గ్రహీతలతో పాఠశాల సిబ్బంది

కవిటి: విద్యార్థులతో పాటు సమాజాన్నీ సక్రమమైన మార్గంలో నడిపించే మార్గదర్శకులు గురువులని మండల కో-ఆప్షన్ మెంబర్, ఉషోదయ యువజన సంఘం అధ్యక్షుడు పాండవ చంద్రశేఖర్ అన్నారు. కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సుదీర్ఘంగా తమ సేవలందించి ఇటీవల పలు పాఠశాలలకు బదిలీ అయిన ఉపాధ్యాయులను పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, ఉషోద యువజన సంఘం సభ్యులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమ సమాజ స్థాపనలో ఉపాధ్యాయులది కీలకపాత్రని కొనియాడారు. అనంతరం పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఎన్.విశ్వనాథం, గోవిందచంద్రపాడి, బి.జానకిరావు, డి.శిరీష, పి.లక్ష్మి, ఎస్.వి.రమణలకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బెందాళం మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు, తెప్పల మోహన్, దశరథ పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని పరుశురాంపురం పంచాయతీ నందవ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయురాలు కె. భవానిను బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వీరు పాఠశాలకు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ ఎస్ ఆదినాయుడు , ఎంఇఒ ఎస్.దేవేంద్రరావు, ఎం. పద్మనాభం, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణ , స్కూల్ కమిటీ చైర్మన్ విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి అప్పలరాజుకు సన్మానం

ప్రజాశక్తి- పలాస

జిల్లా గొర్రెలు, మేకలు పెంపకదారుల కో-ఆపరేటివ్ సొసైటీ జిల్లా అధ్యక్షులుగా రాపాక చిన్నారావు యాదవ్ ఇటీవల నియామకమయ్యారు. ఈ మేరకు మంత్రి స్వగృహంలో పశు సంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎపి యానియన్ అండ్ హస్ట్సండ్రీ డిపార్ట్‌మెంట్ తరుపున అధ్యక్షులుగా నియమించినట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినందుకు మంత్రికి దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, ఎఎంసి వైస్ చైర్మన్ ప్రతినిధి జినగ సీతారాం, ఎంపిటిసి ప్రతినిధి కోరాడ ధనరాజు, మాకనపల్లి సర్పంచ్ సైని దేశయ్య, లోహరిబంధ సర్పంచ్ రాపాక శేషగిరి, యాదవ సంఘం జిల్లా కార్యదర్శి ఐతి ఈశ్వరరావు పాల్గొన్నారు. కాగా, పలాస మండలంలోని గొల్లమాకన్నపల్లికి చెందిన చిన్నారావు నియామకం కావడంతో జిల్లా యాదవులు అభినందనలు చెప్పారు.

మంత్రిని సన్మానిస్తున్న చిన్నారావు

30న జాతీయ మహాసభ

ప్రజాశక్తి- పలాస

ఢిల్లీలో జరుగుతున్న 9వ అఖిల భారత ప్రగతిశీల మహిళా సంఘం జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఐప్వా జిల్లా నాయకులు కోనారి ఈశ్వరమ్మ, వనజ, లక్ష్మి, గీతమ్మ, తులసమ్మ కోరారు. కాశీబుగ్గలో ఈ మహా సభలను విజయవంతం చేయాలని కోరుతూ ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా కోనారి ఈశ్వరమ్మ మాట్లాడుతూ మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించిన బ్రిజ్ భూషణ్ సింగ్‌ను సుప్రీం కోర్టు జోక్యం చేసుకొని ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని చెప్పినంత వరకు గుజరాత్ ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని, ఇటువంటివారికి బిజెపి మద్దతు ఇవ్వడం దారుణమన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు దాటినా మహిళలపై చిత్రహింసలు రెట్టింపు స్థాయిలో పెరిగిపోతున్నాయన్నారు. మణిపూర్ సంఘటనను మనం గుర్తు చేసుకుంటే...దేశం ఎటు పోతోందనని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 30, 1 అక్టోబర్ తేదీలలో జరుగుతున్న మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళలతోపాటు సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు మద్దిల రామారావు, వంకల అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

కాశీబుగ్గలో ప్రచారం చేస్తున్న ఐప్వా ప్రతినిధులు

అర్హులందరికీ పింఛన్లు

పలాస : వైసిపి ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు మంజూరు చేసి పంపిణీ చేస్తున్నామని వార్డు కౌన్సిలర్లు, ప్రతినిధులు శిష్ట గోపి, అంబటి ఆనంద్, బడగల బాలచంద్రుడు అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో సూదికొండ సచివాలయం పరిధి 2వ వార్డులో 9 మంది, 19వ వార్డు 24, 20 వార్డులో ఆరుగురికి పింఛన్లను బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్ కుమార్, వార్డ్ వెల్ఫేర్ సెక్రటరీ జి.విగ్నేష్, వార్డు అడ్మిన్ సెక్రెటరీ హెచ్.ధర్మారావు పాల్గొన్నారు.

బ్రాహ్మణతర్లలో...

నూతనంగా మంజూరైన వైఎస్సార్ పింఛన్ కానుక 30 మందికి సర్పంచ్ బాడన పుష్ప పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ తుంగాన రవణమ్మ, మాజీ ఎంపీటీసీ దంతం వైకుంఠరావు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణరేఖ, వీఆర్వో సోమేశ్వరరావు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

పోలాకి : మండల పరిషత్ కార్యాలయంలో 200 మందికి నూతన పింఛన్లను జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య అందజేశారు. ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయుడు, వైసిపి మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, వైస్ ఎంపిపి కె.తాతారావు, ఎంపిడిఒ ఉషశ్రీ ఎస్.ఎల్.పురం సర్పంచ్ ప్రతినిధి రమణ, పరిపాలన అధికారి సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

లావేరు : పింఛన్‌ను అందజేస్తున్న అప్పలనాయుడు

ఇచ్ఛాపురం : 20వ వార్డు రత్తకన్న సచివాలయ పరిధిలోని నూతన పింఛన్లను వైసిపి జిల్లా ప్రచార కమిటీ చైర్మన్, వార్డు కౌన్సిలర్ తాడి ఆదిరెడ్డి అందజేవారు. చీడిపోతు జగన్నాయకులు, లెంక జయరామ్ పాల్గొన్నారు.

లావేరు : మండలంలోని పెదలింగాలవలసలో నూతన పింఛన్లను వైసిపి నియోజకవర్గ నాయకులు లుకలాపు అప్పలనాయుడు పంపిణీ చేశారు. కార్యదర్శి మడ్డి రమణ, లుకలాపు సుధీర్, దాలి నాయుడు, కళ్యాణి, గురునాయుడు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: మండలంలోని డోకులపాడులో నూతన పింఛన్లను సర్పంచ్ వడ్డి సరిత పంపిణీ చేశారు. భాగ్యలక్ష్మి, ధిల్లేశ్వరరావు, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలతో ఎమ్మెల్యే ఆత్మీయ కలయిక

ఎమ్మెల్యే కిరణ్ కుమార్‌ని సన్మానిస్తున్న కార్యకర్తలు

ప్రజాశక్తి- రణస్థలం

గ్రామ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కార్యకర్తలు పని చేయాలని ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. మండలంలోని తెప్పలవలస పంచాయతీలో కార్యకర్తలతో ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ప్రతి కార్యకర్తనూ పేరుపేరునా పిలిచి ఆత్మీయంగా పలకరించి వారికి సమస్యలు ఏవైనా ఉంటే అక్కడికక్కడే పరిష్కరించేలా చొరవ తీసుకుంటున్నారు. గ్రామస్థాయి లోని సమస్యలు పరిష్కరించేందుకు అధికారులతో మాట్లాడి పరిష్కరించాలన్నారు. సోషల్ మీడియా మాధ్యమాల్లో ఈ నాలుగేళ్లలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై విస్తృంగా ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రణస్థలం మండలం జెసిఎస్ ఇంచార్జ్ చిల్ల వెంకటరెడ్డి, తెప్పలవలస పంచాయతీ సర్పంచ్ ప్రతినిధి బొమ్మలాట శ్రీరాములు, తెప్పలవలస పంచాయతీ వైసిపి నాయకులు దన్నాన హరి, కొయ్య సోములురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ప్రభుత్వ కార్యాలయాలు ప్రారంభం

మెళియాపుట్టి : మండలంలోని గోకర్ణపురం, కరజాడ, జోడూరు గ్రామాల్లోని సచివాలయాలు, ఆర్బికే కేంద్రాలను బుధవారం స్థానిక ఎమ్మెల్యే రెడ్డి శాంతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు సేవలు అందుబాటులో ఉండేందుకు ఈ కేంద్రాలను ప్రభుత్వం

జెసిఐ గ్రీన్ సిటీ సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అంధ కళాకారులకు నిత్యవసర సరుకులు అందజేయడం హర్షణీయమని ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్ అన్నారు. జెసిఐ గ్రీన్ సిటీ వారోత్సవాలలో భాగంగా బుధవారం బెహరా మనోవికాస కేంద్రంలో సుమారు 80 మంది పిల్లలకు స్నాక్స్, అంధ కళాకారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ మాట్లాడుతూ జెసిఐ గ్రీన్‌సిటీ ప్రెసిడెంట్ మణిశర్మ, వేణుగోపాల్ మాట్లాడుతూ సేవలకు చిరునామాగా శ్రీకాకుళం గ్రీన్‌సిటీ ఉందన్నారు. అనంతరం కల్లేపల్లి ఉష, బెహరా మనోవికాస నిర్వాహకులు బి.ఎన్.ఆర్.శేఖర్, శ్యామలాకుమారిలను సత్కరించారు. కార్యక్రమంలో జెసిఐ సెనేటర్ పాలిశెట్టి మధుబాబు, ఐపిపి సాయిబాబా, సత్యనారాయణ, మల్లేశ్వరరావు, లక్ష్మణ్, గణపతి, కళ్యాణ్, సింహాచలం, కుప్పిలి చిత్రలేఖన ఉపాధ్యాయులు ఉర్లం రవితేజ్, చేయూత మేమున్నాము వారణాసి వెంకటలక్ష్మి, జాడ సాయి, సుప్రజా రౌత్, సిక్కోలు స్వచ్ఛంద సేవ సమితి సభ్యులు పొడుగు చరణ్, డాక్టర్ పైడి ప్రదీప్ పాల్గొన్నారు.

తాతబాబును పరామర్శిస్తున్న మంత్రి ధర్మాన

మంత్రి ధర్మాన పరామర్శ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కొన్ని రోజులుగా అస్వస్థతకు గురై నగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీకాకుళం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మూకళ్ల తాతబాబును రెవిన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు పరామర్శించారు. బుధవారం ఆస్పత్రికి వెళ్లి తాతబాబు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకుని బాధితునికి ధైర్యం చెప్పారు. ఆయనతో పాటు వైసిపి నాయకులు మూకళ్ల సుగుణ, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, శ్రీనివాసరావు ఉన్నారు.

నియోజకవర్గంలో
73,800 ఎకరాల్లో ఖరీఫ్ సాగు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి నియోజకవర్గంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 73,800 ఎకరాల్లో వరి పంట సాగు అవుతోందని టెక్కలి వ్యవసాయశాఖ ఎడి బివి తిరుమలరావు అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటివరకు 70 శాతం ఈ-క్రాప్ నమోదు పూర్తయిందని, 30 శాతం పూర్తి కావాల్సి ఉందని, ఈ నెల 30వ తేదీలోగా ఈకెవైసి పూర్తి చేసుకోవాలన్నారు. ఈ క్రాప్ నమోదు చేసుకున్న వారికి ధాన్యం అమ్మకానికి వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా వర్తిస్తాయన్నారు. డీఏపీ, యూరియా, పొటాష్ కలిపి 4,200 టన్నులు రైతు భరోసా కేంద్రాలు ద్వారా సరఫరా చేస్తామన్నారు. రైతులు డిఏపిని పూర్తిగా వాడకుండా కేవలం యూరియా వాడడం ద్వారా వరి దోమపోటుకు గురవుతుందన్నారు.

ఘనంగా పౌష్టికాహార మాసోత్సవాలు

కొత్తూరు : అవగాహన కల్పిస్తున్న విమలకుమారి

ప్రజాశక్తి - కొత్తూరు

మండలంలోని ఆకులతంపర సెక్టార్‌లోని మకావరం అంగన్వాడి కేంద్రంలో బుధవారం పౌష్టికాహార మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్‌పిఒ విమలకుమారి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకుంటే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు ఆ పరిధిలో ఉన్న ప్రజలకు అవగాహనకల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గార భాస్కర రావు, ఎంపిటిసి చీకటి వీర్రాజు, ప్రధానోపాధ్యాయులు వైకుంఠరావు, సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

పలాస : రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులకు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని ఎంపిడిఒ. ఎన్.రమేష్ నాయుడు అన్నారు. మంగళవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారుల వయసును బట్టి ఎత్తు, బరువు సమాచారాన్ని ఎప్పటికప్పుడు సచివాలయ కేంద్రాలకు తెలియజేయాలన్నారు. ఈ నెల 30 నుంచి జగనన్న ఆరోగ్యరక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఆ కార్యక్రమానికి అంగన్వాడీ కార్యకర్తలందరూ హాజరై సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాశీబుగ్గ ఐసిడిఎస్ పిఒడి శారద్వాణి, సూపర్‌వైజర్లు యు. లత. పి. గంగమ్మ. ఎస్. సరస్వతి, డి. ధనలక్ష్మి పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు ఎదిగి కళాశాలకు, తల్లిదండ్రులకు, అధ్యాపకులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ధిగా స్థలదాత దుక్క మధుసూదన రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక దుక్క రాజన్న రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థినీ, విద్యార్థుల కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతు వైకుంఠరావు అధ్యక్షతన ప్రవేశ్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కొత్తగా చేరిన ప్రథమ సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సాహపరిచాయి. ఈ సందర్భంగా ఎనిమిది మంది విద్యార్థులు నాలుగు గ్రూపుల నుంచి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వారికి మధుసూదన రెడ్డి నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతు వైకుంఠరావు, నందిగాం ప్రిన్సిపాల్ ఆర్. జనార్ధన రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బహుమతులను అందజేస్తున్న మధుసూదన్‌రెడ్డి

పంట పొలాలను పరిశీలిస్తున్న అధికారులు

వరి నారుమళ్లు పరిశీలన

సోంపేట : తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఎండిన వరి పొలాలను, నారుమళ్లను జిల్లా వ్యవసాయ అధికారులు బుధవారం పరిశీలించారు. మండలంలోని పలాసపురం పరిసర ప్రాంతాల్లో పంట పొలాలను వ్యవసాయ శాఖ జెడి శ్రీధర్‌తోపాటు ఎడిఎలు భవాని శంకర్, జగన్మోహన్ రావు, ఎఒ నరసింహ మూర్తి పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ తడక జోగారావు రైతుల దుస్థితిని అధికారులకు తెలియజేశారు. నాట్లు పడే అవకాశం లేకపోవడంతో తక్కువకాలంలో పండే పంటల సాగుకు ప్రభుత్వం నుంచి తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేశారు. సబ్సిడీపై విత్తనాలు అందించాలని కోరారు. జెడి శ్రీధర్ మాట్లాడుతూ నారుమళ్ల రక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ప్రతి రైతు పంటల నమోదు చేసుకోవాలని, అప్పుడే పంట నష్టం పొందే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు

పలాస: పలాస మండలం బొడ్డపాడు ఉన్నత పాఠశాలలో జిల్లా ఆంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి వైద్య నిపుణులు రోణంకి వెంకటరమణ 261 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా 23 మంది విద్యార్థులకు దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించారు. అనంతరం కంటి రోగుల విద్యార్థులకు ఉచితంగా కళాద్దాల పంపిణీ చేశారు. విద్యార్థులు ఎక్కువగా ఆకుకూరలు తీసుకోవాలని ఈ సందర్భంగా హెచ్ఎం ఎ.వీర్రాజు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ హెచ్‌పి. ఎస్. సరస్వతి, పంచాయతీ కార్యదర్శి టి.ఆదిలక్ష్మి, ఆశ కార్యకర్త జ్యోతి అన్నపూర్ణ వై హేమలత పాల్గొన్నారు.

పర్యటిస్తున్న వెంకటరావు చిట్టి

'గడప గడప' నిధులతో గ్రామాల అభివృద్ధి

ప్రజాశక్తి- పలాస

రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న గడప గడపకు నిధులతో గ్రామాలు అభివృద్ధి చేస్తున్నామని పలాస పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి అన్నారు. మండలంలోని బంటుకొత్తూరు పంచాయతీలో బుధవారం ఆయన పర్యటించారు. గ్రామంలో సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సిసి రోడ్లు కాలువ పనులు చేపట్టి అభివృద్ధి చేస్తామన్నారు. ఇప్పటికే మండలంలో చాలా పంచాయతీల్లో రోడ్లు కాలువలు మౌళిక సదుపాయాలు కల్పించామన్నారు. పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. ఇంకా ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకపోతే తక్షణమే మంజూరు చేసి అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పిట్ట షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి అండ

కవిటి : కవిటి మండలం పాత శిలగాం గ్రామానికి చెందిన జున్ను రౌలో గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. వైద్యం కోసం సుమారు రూ.45 వేలు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పడంతో ఆమె దాతల సాయం కోసం ఎదురుచూస్తోంది. దీంతో ఆమె భర్త రాము రౌలో జైహింద్ ఫౌండేషన్ సభ్యులను సంప్రదించడంతో ఫౌండేషన్ సభ్యులు బుధవారం గ్రామానికి చేరుకుని రూ.25 వేలు అందించారు.

నీలకంఠంను సన్మానిస్తున్న సభ్యులు

నీలకంఠంకు సన్మానం

ప్రజాశక్తి- పలాస

మండలంలోని నీలావతిలో ఉద్దాన ప్రాంత విద్యాభివృద్ధి వేదిక (యువివి) గ్రంథాలయంలో సహోదర యువజన సంఘం, అండమాన్ అధ్యక్షులు కుత్తుం నీలకంఠంకు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నీలకంఠం మాస్టర్ మాట్లాడుతూ యువివి ఆధ్వర్యాన ఉద్దానంలో విద్యావ్యాప్తికి ఎంతగానో కృషి చేస్తుందని అన్నారు. యువివి స్ఫూర్తితో అండమాన్‌లోనూ విద్యా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం గ్రంథాలయానికి 20 కుర్చీలు అందజేశారు. కార్యక్రమంలో యువివి అధ్యక్షులు ఇసాకోటి జోగారావు, కార్యదర్శి బొడ్డు చిన్నారావు, కుత్తుం ప్రకాశరావు, జినగ సీతారాం, కుత్తుం సుధాకర్, తంగుడు ఖగేష్, యంపల్ల కామేశ్వరరావు, పుష్ప తదితరులు పాల్గొన్నారు.